
# వలల్ల



నెమలీకలు చుట్టిన కట్టె చేతులపట్టుకుని గుడిసెలోంచి వంగుతూ బయటకు వచ్చాడు గంగయ్య. అప్పటికి తెట్టన తెల్లారింది. బజార్లకచ్చి నిలబడి అటూ ఇటూ తేరి పారజూసాడు. సందుల్లో నుండి వాకిట్లనుండి, ఒక్కటే.... బర్లు, దుడ్డెలు, పెయ్యలు వత్తున్నాయి. వాటి వెంట తట్టపట్టుకుని వచ్చినోళ్లు పెండపెట్టంగనే మళ్లిపోతున్నారు. కొందరు తట్టల్ని నింపుకుంటున్నారు. బర్లులేనోళ్లు వాకిట్ల సానుపుకోసం పెండగావాలని బర్లెంబడి తిరుగుతున్నారు.

తట్టలు నెత్తిమీద పెట్టుకున్న చిన్న చిన్న పోరగాండ్లు బర్లుతోకలెత్తగానే 'అగో పెండనాది' 'బర్రెపెండ' నేను ముందుగల్ల చూసిన' అంటూ అటూ ఇటూ పరుగులు తీస్తున్నారు. ఒకరి బర్రెది మరొకరు తీసుకున్నరని కొందరు లొల్లి పెట్టు కుంటుండ్రు.

దడువాయి పెండను గుత్తపట్టు కున్నోల్లు అందరినీ అదిలిస్తూ తట్టను నింపు తుండ్రు. మావాకిట్ల పెంట్టిందని ఒకరు. అది మా బర్రె అని ఒకరు. వాకిలి ముందునుండి బర్లు పోతయి, మాకే పెండలేదంటవా అని ఒకరు నోరు పెద్దగ జేసుకుని అరుస్తున్నరు. బర్ల కాళ్ల దుమ్ము బజారునిండా పొగలెక్కలేస్తుంది. పొద్దుగల్ల వాగుకు పోయేటోళ్లు, వాకిళ్లు ఊడ్చేటోళ్లు ముక్కుకు అడ్డంగా బట్టపెట్టు కుంటుండ్రు. ఒక సారి పెయ్యి విరిచి వాయిలింపు తీసిండు గంగయ్య. ఎడను చేతిలోని కట్టెను కుడిచేతిలోకి మార్చుకుంటూ కూతురును కేకేసిండు. "లచ్చిమీ... అవ్వను మందకాడికే సద్ది తెమ్మను బిడ్డా. ఇయ్యల్ల పెండ ఎవలూ కూడేసు కోరట. నేనే కావలుండాలె. వచ్చిన్నాడు నేను నేనని

మీదమీద వడుతరు. రాన్నాడు ఎవ్వలు రారు'' అంటూ ముందుకు నడిచాడు.

"నీకంటే పండుగులేదాయె పబ్బం లేదాయె. ఊరందరికుండదా ఏంది? ఇయ్యాల పెత్తిరమాస (మహాలయ అమావాస్య). పెద్దలకు బియ్యమియ్యాలె. అప్పటికి లచ్చిమిని తోలిత్త. నువ్వచ్చి బామనైనకు బియ్యమిచ్చి బుక్కెడంత తినిపో. యాడాదికొక దినం. పెద్దలకు బియ్యమియ్యంది ఎట్లతింటవు''. వాకిలి ఊడుస్తూ అన్నది లింగవ్వ.

"అయితాయె తియ్యి. గట్లనే వత్త. పనంత తీరినంక లచ్చిమిని తోలియ్యి'' అంటూ కుంటుతూ ముందుకు నడిచాడు గంగయ్య. వెనుక నుండి కొన్ని బర్లు దుమ్ములేపుకుంటూ అతడిని దాటి వెళ్లిపోయాయి. ఒకటి రెండు బర్లు పక్కకు తిరిగి అతడిని చూస్తూ 'వాయ్'మన్నాయి.

దుమ్ము, ధూళితో కైలివారిన బనీను, అతుకులు వడ్డ బుడ్డగోచీ, పీక్కుపోయిన మొహం. మొహంనిండా గడ్డం, ఎముకలన్నీ పోగుజేసి చర్మం కప్పినట్టు బక్కగా ఉంటాడు గంగయ్య. ఎడమ కాలుమోకాలి కింద వడి తిరిగినట్టుండి ఒకటి రెండంగుళాలు చిన్నగా ఉండడంతో గెంటినట్టుగా నడుస్తాడు.

కాలువంకర పుట్టుకతో వచ్చింది కాదు. ఐదేళ్ళ క్రితం వరకు బలంగా, బాగానే ఉండేవాడు. ఊరికి పెద్ద రైతు బాల్‌రెడ్డి వద్ద జీతముండేవాడు. కల్లంలో నుండి బండి మీద వడ్లు జారగొడుతుండగా జారికిందపడ్డాడు. ఎడమకాలు బండి పయ్య కిందపడింది. అప్పటి మందం ఊరిలో మందు గోళీలు ఇప్పిచ్చాడు బాల్‌రెడ్డి. దవాఖానా ఖర్చులకని ఐదువందలిచ్చి చేతులు దులుపుకున్నాడు.

గంగయ్య మాత్రం ఏడాదిదాకా కోలుకోలేదు. చెట్లమందులు, కట్టుగట్టుడు పత్తెం తిండని రెండు నెలల దాకా దవాఖానకు పోలేదు. అక్కడి ఖర్చువింటేనే భయమయింది. చివరికి వెళ్లక తప్పిందికాదు. బాల్‌రెడ్డి వద్దకు వెళ్ళి బతిమాలితే ఒక్క పైసా ఇవ్వనన్నాడు. 'నిన్ను సక్కగ బండి కొట్టుకరమ్మన్నగని బండికింద పడమన్ననా? ఐదువందలిచ్చుడే దండుగ'' అన్నాడు.

'నీకు ఎద్దోలె కష్టం జేసిన పటేలా. నీ భూముల్ని నా భూములనుకున్న. నీ ఎడ్లను నా ఎడ్లలెక్క సూసుకున్న. ఇయ్యల్ల నా కాలిరిగితే నువ్వుగాక ఇంకెవలు ఆదుకుంటరు. వట్టిగా కాకపోయినా అప్పుగానైనా ఇయ్యి. నీకే కష్టం జేసి తేర్చుకుంట' ఏడుస్తూ అన్నాడు గంగయ్య.

అతడి కన్నీరు బాల్‌రెడ్డికి నవ్వును తెప్పించింది. మరింత పంతానికి పోయాడు. తన ఇంటివైపు కూడా కన్నెత్తి చూడద్దని బెదిరించాడు. అతడి పలుకుబడి ముందు గంగయ్య బాధ కన్నీరై కారిపోయింది ఏ ఒక్కరినీ కదిలించలేదు.

సానుభూతిని చూపించిన ఒకరిద్దరు బయటపడడానికి భయపడ్డారు. 'మామూలోడుగాదు. గాయినతో మనకేంపంచాది. ఎప్పుడేం పనిపడుతదో' నని నోరు విప్పలేదు. పోలీసుల దగ్గరికిపోయి కేసు పెట్టుమని మాత్రం సలహా ఇచ్చారు.

కేసనగానే వణుకు పుట్టింది గంగయ్యకు. ఎటుపోయి ఎటత్తదోనని ఎవ్వరితో చెప్పలేదు. ఇల్లును అమ్మేసిండు. పెరట్ల గుడిసేసుకున్నడు. ఆరు నెలలు దవాఖానకు తిరిగిండు. చేతిలోఉన్న చివరి రూపాయి కూడా మందుల రూపంలో మారే వరకు కాలు అతుక్కోలేదు.

ఇంటికి వచ్చాక ఎవరూ జీతముంచుకోలేదు 'కుంటుకుంట నువ్వేం పనిచేస్తవని' మొఖం ముందే నవ్విండ్రు. వాళ్లను వీళ్ళను బతిమిలాడి బర్లకాడికి జీతం కుదిరాడు. గంగయ్య కుంటి

గంగయ్యగా, బర్లకాడి గంగయ్యగా మారిపోయాడు.

అదే యేడు పాలమోటార్ ఊర్లోకి రావడం, ప్రభుత్వం అప్పులివ్వడంతో బర్ల సంఖ్య బాగా పెరిగిపోయింది. ఊరు బర్లన్నీ గంగయ్య జంగిట్లోకివచ్చాయి. ఒక్కొక్క బర్రెకు ప్రతీపంటకు రెండు బుడ్ల వడ్లు ఇచ్చే ఒప్పందంమీద గంగయ్య స్థిరపడిపోయాడు.

"గంగా... బర్రె సుడిమీదుంది. తీగలేత్తుంది. ఇప్పుడో అప్పుడో అన్నట్టుంది. మెల్లమెల్లగ కొట్టుకపో. బర్లతోని తింపకు. యాడనన్న చెట్టుకింద కొట్టు. తౌవ్వల ఈనితే మాయివడ్డంక కొట్టుకరా' భూదయ్య మాటలతో తలెత్తి 'గట్లనే' అంటూ గుంపులా ఉన్న బర్లను కదిలించాడు గంగయ్య. బజారునిండా దుమ్ములేచింది. లేచిన దుమ్ము గంగయ్య ఒంటిమీదే కాదు.. ఊపిరి తిత్తులగుండా రక్తంలో కలిసిపోతుంది. బర్రెల్లో బర్రెలా వాటివెంట నడుస్తున్నాడు. తౌవ్వల ఇండ్లున్న వారు జంగిడిపోతుండగా బర్లను ఇడిసిపెడుతున్నారు.

పొదుగు పలిగిందని ఒకరు, కుంటుతుందని ఒకరు, కుడిది తాగుతలేదని ఒకరు, గడ్డిమేస్తలేదని ఒకరు దారిపొడుగునా ఏవేవో చెబుతున్నారు. అందరికీ సలహాలిల్తూ పెండకొరకు వెంటవస్తూ మందలోకి చొచ్చుకపోతున్న పోరగండ్లను అదిలిస్తూ ఊరు దాటిండు గంగయ్య.

"ఈయేడు కాట్రేవులకు చెయ్యాలె. ఇంటికి సోలెడు బియ్యం వసూలు చెయ్యాలె. బర్లకు గాల్లయితున్నయి. ఎక్కువ కాకముందే మొక్కు చెల్లియ్యాలె. లచ్చిమిని రమ్మనాలె. చెట్లకిందనే వండుకతినాలె. బిడ్డచ్చిన్నుండి ఎప్పుడుగిదే ఎత్తుకోలు మొత్తుకోలాయె. నేనేలేకిడోన్నంటే నాకంటే లేకిడోడు వాడు. ఎప్పుడుతన్నుడు గుద్దుడేనాయె. మీదికెల్లి నీ అవ్వగారేం బెట్టింద్రే అంటడట. పెట్టేదేంది పెంటలమూతి. ఎవరికట్టం వాళ్లు జేసుక బతుకాలె గానీ ఒకడు పెడుతే నిండుతదా ఆడికి పదీ పరకా అంటే సదురనే వడిలి. బిడ్డ కిస్మత్ మంచిగలేదు. దాని రాతలమన్నువాడ. మా రాతలన్నీ రోకలిబండతో రాసిండు. ఎదిగిన కొడుకు చేతికింద ఉంటడంటే సదువద్దురా అన్నందుకు దెంకపోయె. యాడున్నదీ పత్త దెలవకపాయె. పెండ్లామంటున్నది రోగాలకుప్ప. పొద్దుగల్ల ఒక తీరుంటది. పొద్దుగూకి ఒక తీరుంటది. అయినా దాని దేం తప్పుతియ్యి. మందంటినా సూదంటినా గోలీలంటినా పొట్టకుబతుకుడే కట్టంగావట్టే! చేతుల పైసలుండి మందులిప్పిత్తే మంచి గైతుండె గావచ్చు. చేసినకట్టం పొక్కకే సాలుతలేదాయె. థూ నీయవ్వా...." కాండ్రించి ఉమ్మితూ వాగులోకి దిగాడు గంగయ్య.

బర్లను ఇసుక తెప్పమీదికి మలుపుతుండగా ఎక్కడి నుండి వచ్చిందో! గొర్రెపిల్ల. మందలో కలిసింది. బర్లు కుమ్మితుంటే ముందుకు పరుగుతీసింది. ముందున్న బర్లన్నీ దానివెంట పోవడానికి ఉరుకుతూ గడ్డకు ఎక్కాయి. అప్పటికే గడ్డకెక్కిన గొర్రెపిల్ల జిబ్బుగా ఉన్న ఈతచెట్లల్ల కురికి ఎగపోస్తూ నిలవడ్డది.

ఈత చెట్లు దాటితే వరిపొలాలు, పొలం తొక్కినా, మేసినా దండుగంటరు. జురుమానంటరు. భయం భయంగా అటువైపు పరుగు తీసాడు గంగయ్య.

ఈదుల్ల అవుతలి నుండి 'అహయ్' అంటూ బర్లను అదిలించాడు. బర్లతోపాటు గొర్రెపిల్ల గూడా చెట్లల్లనుండి వాగు అంచుకు దిగింది. కాలిబాటవెంట కిందికి దిగి 'సీగత్తర్రాను.

యాడికెళ్ళివచ్చినవు. బర్లు నిన్ను సూసినంక ఉంచుతయా తొక్కి సంపుతయి' అనుకుంట


కథా నిలయం
5304

గొర్రెపిల్లను పైకి గెదుమపోయాడు గంగయ్య. యాడికెళ్లి దూసుకచ్చిందో బాల్‌రెడ్డి పెయ్యదుడ్డె - కండపట్టి ఉన్నది- కర్రెగ కనిపిస్తున్న గొర్రెపిల్ల మీదికి ఉరికింది. భయంతో గొర్రెపిల్ల పొలాల్లోకి పరుగుతీసింది. దాని వెనుక పరుగెత్తింది పెయ్యదుడ్డె. దాన్ని మలుపుకత్తుండంగ ఈతమట్ట మీద అడుగుపడింది. ఏదుకొయ్యల్లా ఉన్న శాగవారిన ఈత ముండ్లు రెండు కాలులోకి కసుక్కున దిగాయి.

గంగయ్య కళ్లల్లోకి నీళ్లు చిమ్మాయి. కుడికాలెత్తి ఒంటికాలిమీద నిలబడబోతూ సొలిగికింద పడ్డాడు. అరిచేతుల్ని నేలకానిస్తూ లేచి గొగ్గాల్లమీద కూసుండి ముండ్లను బయటకు లాగాడు. జివ్వున రక్తం చిమ్మింది. ఒకటి బయటకు వచ్చిందికాని ఇంకోటి సగానికిపైగా ఇరిగింది. గుంట గన్నేరాకును నలిపి కాలుకు అద్ది తెప్పమీదికి వచ్చాడు గంగయ్య.

అప్పటికే బర్లన్నీ ఇసుక తెప్పమీదికి చేరి నిలబడ్డాయి. సుడిమీదున్న బర్లు చాతగాక కూలబడ్డాయి. ఎదునకచ్చిన పెయ్యల్ని పోతులు గెదుముతుంటే కొంతదూరం వెళ్లి మందలో కలుస్తున్నాయి. ఇసుకలో చతికిలబడ్డాడు గంగయ్య.

రోజూ ఎవరో ఒకరు పెండకూడేసుకోవడానికి వచ్చేవారు. కోతలయ్యాకనైతే పొలాల్లోనే మంద పెట్టుమంటారు. మందపెట్టినందుకు కల్లుకనిఐదు రూపాయలిచ్చేవారు. ఇంటికి వెళ్లి అన్నం తినచ్చేవరకు కాపలా కాసేవారు. బర్లను మేతకు కొట్టుకుపోయినంక పెండకూడేసుకునేవారు. ఈ రోజు ఎవరూ రాకపోవడంతో కాపలాకాయడం తనవంతయింది.

మొలదారం నుండి కాంటను తీసి ముల్లును గెలికియ్యడం మొదలెట్టాడు గంగయ్య. అప్పటికే కాలుసలుపడం మొదలయింది. కాంటతో గెలికినప్పుడు సులుక్కుమని ముల్లు లోపటికే పోతుందిగని బయటకు రావడంలేదు. ముల్లు లోతుగా ఇరిగిందేమో గోర్లకు కూడా అందుతలేదు. పొద్దంతా ఎట్లనడుసుడోనని ఆలోచిస్తూ కూర్చున్నాడు గంగయ్య.

అప్పటికే బర్లన్నీ కాళ్లు మడిచి పండుకున్నయి. మీదికి మొఖం పెట్టి దోమలను ఇసురుకుంట నెమరేత్తున్నయి. పొద్దుబారెడు పైకెక్కింది. ఎండ చెక్కుమంటుంది. మర్రి చెట్టునీడ చింతచెట్టు నీడ ఉండడంతో ఇసుక తెప్పమీద సల్లగుంది. వాగుల అక్కడక్కడ మడుగులల్ల తప్ప పారుతున్న నీరులేదు.

పొద్దు మరో బారెడు పైకెక్కినాక వచ్చింది లచ్చిమి. ఇంతవరకు మంద మొహమెప్పుడూ చూడలేదాపిల్ల. ఎప్పుడు రావాలన్నా లింగవ్వనే వచ్చేది. రెండుమూడు రోజులనుండి జరం రావడంతో నడువడానిక్కూడా ఓపికలేదని లచ్చిమిని పంపింది లింగవ్వ. వస్తూనే కాంటతో గెలుకుతున్న కాలివైపు చూసింది లచ్చిమి.

“ఏందినాయినా.. ముల్లుగిట్ల గుచ్చిందా? ఈతముల్లు పాడుగాను అదిగిట్లగుచ్చితే నొప్పివశంగాదు. నా దగ్గర చిమ్మటుంది. తీత్తఉండు” అంటూ తండ్రి కాలును తనతొడపై ఉంచుకుని మెడలోని దండకున్న చిమ్మట తీసింది.

కాలులోకాదు. ఈసారి గుండెలో కలుక్కుమంది గంగయ్యకు. ‘వద్దుబిడ్డ. ఆడిపిల్లవు. నా కాల్లు ముడుతావు’ అంటూ కాలును మడిచి కూర్చున్నాడు.

‘ఎవలైతే ఏంది నాయినా... పొద్దంతా ఎట్లనడుత్తవు. చెప్పులు కొనుక్కోమంటే కొనుక్కోవు.

బర్లెంబడి ఎందుకురికినవు. యాందాక పోతుండె. అయినా అవి కొట్టంగ కొట్టంగ జరుగయి. గట్లెందుకురికినయి''. తండ్రిపక్కనే కూర్చుంటూ అడిగింది లచ్చిమి.

అడుగనైతే అడిగిందిగని అడిగినంక యాదికచ్చింది లచ్చిమికి. తన పెళ్లయినయేడే తగిలింది జురుమానా. ఇదే తెప్పమీద బర్లమంద పెట్టి ఇంటికి వచ్చాడు నాయిన. పెండకూడేసుకునే మనిషి పక్కకు పోతున్న బర్లను మలుపలేదు. మందనుండి నాలుగు బర్లు తప్పిపోయాయి. వాటిని చూసుకోకుండా బర్లతో అడవికి వెళ్లాడు నాయిన.

నాలుగు బర్లు సూడుసూడు మన్నట్టు బాల్ రెడ్డి చేనులోకే వెళ్లాయి. పొట్టకచ్చినవరిని మేసాయి. ఒకటిరెండు మడ్లను తొక్కిపాడు చేసాయి. వాటిని బంజెరు దొడ్డిలో కొట్టి పంచాది పెట్టాడు రెడ్డి. తప్పంతా గంగయ్యదే అన్నారు. మందకావలున్నది రెడ్డి కులస్థుడే. బర్లుకూడా అదే కులంవారివి. అంతా ఏకమై ఏదుము (ఇరవైబుడ్లు) వడ్ల జురుమానా చెల్లించాలని, పంటచేనుపాడు కాకుంటే అంతకంటే ఎక్కువ పండేదని, బాల్‌రెడ్డి దయగల్ల మనిషి కాబట్టి తక్కువకే ఒప్పుకున్నాడని నచ్చజెప్పారు. జీతాలు వసూలు చేసాక ఏదుమువడ్లు ఇవ్వకతప్పిందిగాదు.

"ఏం చెప్పులు బిడ్డా! చెట్లు గుట్టలపొంటి ఏ చెప్పులు ఆగుతయి. ఇగబర్లు ఉరుకుడంటవా...! నల్లగున్నోన్ని చూత్తే మనుషులకే కాదు. పశువులకు కూడా పొడువబుద్ధయితది. సంపబుద్ధయితది. యానంగనో గొర్రెపిల్ల వచ్చింది'' అంటూ లేచి నిలబడ్డాడు గంగయ్య.

కూతురుకు అన్ని జాగ్రత్తలు చెప్పి ఇంటికి చేరుకున్నాడు. ఎడమకాలుకుంటి, కుడికాలులో ముల్లు. ఇంటికి రావడమే తండ్లాడుతూ వచ్చాడు. స్నానం చేసి బామనైనకు బియ్యంబెట్టి డాక్టర్ దగ్గరికెళ్లాడు. లోతుగా చీరితేగాని ముల్లు బయటకు రాలేదు. మందుపెట్టి కట్టుగట్టాడు డాక్టర్. పైసలు ఇవ్వనందుకు గులుక్కున్నాడు.

"కాలం ఇప్పుడు ఎనుకటి లెక్కలేదు. కోతలు కొయ్యంగ వేళ్లు తెగితే గుంటగన్నేరాకు నలిపిపోత్తే ఎండుకపోయేది. ఇప్పుడు చెక్కపేడు గుచ్చినా సెప్టిక్ అయితుంది.'' అంటూ మందులు రాసిచ్చాడు డాక్టర్.

నిర్వేదంగా చిట్టీని మలిచి జేబులో వేసుకుని ఇంటికి చేరుకున్నాడు గంగయ్య. జరిగింది తెలుసుకుని ఉల్లిగడ్డ ఉడికిచ్చి కట్టింది లింగవ్వ. నొప్పి తగ్గటానికని ఉప్పుసురుకేసింది.

ఆగమాగం రెండు బుక్కలు తిని తిన్నాననిపించుకుని బయటకు నడుస్తూ భార్యకళ్ళలో నీళ్లను చూసాడు గంగయ్య. ఆమె ఎందుకేడుస్తుందో అర్థమైంది. 'పైలంగ నడువు' అని చెప్పడానిక్కూడా ఆమెకు ధైర్యం చాలడంలేదని గ్రహించాడతడు.

'గట్ల ఆగమాగము ఉరుకుతరా సూసుకుంట నడువద్దా' అని లింగవ్వ అంటే 'ఇంట్ల గూసుండి నీకు యాడ ఏర్పడుతుందని' గంగయ్య అంటాడు. 'అవును. నేను గుర్రం లెక్కున్న తినుకుంట తిరుగుతున్న.' అని గంగవ్వ అంటది. 'నీ బతుకుల మన్నువాడతియ్యి. నువ్వొకనాడు కట్టంజేత్తే నేను బతికిన్నా. పాత గుడిసె సదిరి నట్టు నిన్ను సదురుడేనాయె' అని అతడంటడు.

'ఇయ్యాల్ల నీకు నడువరాదు. ఎంబడి నేనత్తనడువు. నువ్వో చెట్టుకింద కూసుంటే నేను బర్లను మలుపుత' అని లింగవ్వ అతడివెంట నడిచే సమయమది. ఆమె అనకపోయినా నువ్వు ఇయ్యాల్ల నా ఎంబడిరా, నాకు అటీటు తిరుగరాదు అని అతడు చెప్పే సమయం. కాని ఇప్పుడలా

ఆమె అనలేదు. అనకపోయినా ఇతడు పిలవలేడు. పొద్దుగూకె వరకు ఇల్లు వాకిలూడ్చి ఇంత ఉడికేత్తే అదే మంచిది అనుకుంటున్నాడు.

'చేతికెదిగిన కొడుకు చేతికిందలేడు. ఎదిగిన బిడ్డ ఇంటిమీదుంది. నీడలా ఎంబడుండే పెండ్లాము చావుకు దగ్గరైతుంది. వీటిముందు కాలులో ముల్లు ఓలెక్కకాదు' 'మనసులోనే అనుకుంటూ మందను చేరుకున్నాడు గంగయ్య.

కుడికాలికి నొప్పి. పొద్దంతా ఆయాసపడుతూనే బర్లవెంట అడవిలో తిరిగాడు. ఏడాది క్రితం ఇల్లువదిలిపోయి ఇంత వరకూ జాడతెలియని కొడుకే పొద్దంతా కళ్లముందు కదిలాడు. వాడు నన్ను ఆగంజేసిండు. వాన్ని ఊరు ఆగంజేసింది. పోరగాండ్ల సోపతిపట్టి తిరుగుడు నేర్చిండు. అందరయ్యల లెక్క నాకెల్లుతదా? ఊర్లె పదోది అయినంక సదువు గిదువు ఏదద్దు ఇంకింత ఆగమైతవంటే మంకుపట్టువట్టి కనవడకుంట పాయె. ఈ రెడ్లు, రైతులు పోరగాండ్లకు ఎక్కతక్క పైసలిచ్చి చెడ్డ చెడ్డ అలవాట్లు జేసింన్రు. ఇండ్లల్ల టీవీలు పెట్టి ఆగంజేసింన్రు. ఆ పోరగాండ్లు మావోన్ని ఎంటేసుకునిరి. వాళ్లలెక్క మనకు నడువదిరా అంటే వినకపాయె.

నేను సిన్నప్పుడు గిట్లనే ఉన్ననా? మా నాయిన కూసుండు మంటె కూసున్న. నిలవడుమంటే నిలవడ్డ. అంగిలాగు తొడుక్కోరాకముందే దొరదగ్గర జీతముంచితే కూరుకురాత్రి లేచి సలిలో వణుక్కుంట ఎద్దుపెండ తియ్యలేదా? దొర మెచ్చుకోవాలని ఉరుకురికి పనిజెయ్యలేదా? నేను గిట్లజేత్తే మా అయ్య అప్పుడే బొందలజేరు."

గంగయ్య ఇంటికి మర్లేసరికి కాలు మరింత నొప్పి పెట్టింది. వాపుగూడా వచ్చింది. బూదయ్య బర్రె అడివిలోనే ఈనింది. మాయిపడేదాక ఉండి సంటిదుడ్డెను ఎత్తుకచ్చేసరికి కూరుకురాత్రయింది. రాల్లు, రప్పలు, మొట్లు, మొరన్లు చీకట్లో గాయమైన కాలికే తగిలాయి. సంటిదుడ్డెను బూదయ్య ఇంటికాడ దించేసరికి సల్ల చెముటలు పుట్టినయి. ఒగరుస్తూ ఇంటికి వచ్చి మంచంలో వాలిపోయాడు గంగయ్య. అట్లనే సలిజరము అందుకుంది. ఎన్ని దుప్పట్లు కప్పినా సలి ఆగలేదు. కాలు మరింతగా వాచిపోయింది.

తెల్లారేసరికి జరం ఎక్కువయింది. పెయ్యి పొయ్యి మీది పేనెంలెక్క కాలుతుంది. లింగవ్వ గుండె దడదడలాడింది. 'బర్లకాడికి పోకపోతే ఎట్ల? దసర పండుగని యాడాదికి ఒక్కనాడు బందు పెడితేనే బర్లు ఈగలు కొట్టుకుంటున్నయి. ఊర్లె ఉండి నువ్వేం జేత్తున్నవు?' అంటరు. జరం ఎప్పుడు తక్కువైతదో ఏమో! తెల్లారంగనే పాలు పిండి బర్ల తలుగులు ఇడుత్తరు. ఇడువకముందే చెప్పి రావాలె అనుకుంది.

కూతురును ఒకదిక్కు పంపి తనో దిక్కుపోయింది లింగవ్వ. జరమచ్చిందని బర్లు ఇడువద్దని చెప్పింది. అప్పటికే కొన్ని బర్లు బజార్లవెంట తిరుగుతున్నాయి. విసుక్కుంటూ వాటిని కొట్టుకచ్చి తలుగులకు ముడేసుకుంటున్నారు. డాక్టర్‌ను తోలుకచ్చి రెండు సూదులిప్పించ్చింది. పొద్దున పొద్దున ఉద్దెర ఖాతా అనుకుంటూ గులుక్కుంటూ వెళ్లిపోయాడతడు.

అంబటాల్లవరకైనా తక్కువైతే పగటియాల్లకు బర్లు ఇడుసుకపోతడని చూసింది లింగవ్వ. పగటియాల్లకు మరింత ఎక్కువైంది. చలి అందుకుంది. గొంగడి, దుప్పటి, బొంత కప్పినా ఆగలేదు. డాక్టర్ వద్దకు వెళ్ళాలంటే ఏమంటడోనని భయమేసింది. మొండిగా వెళ్తే రెండు గోలీలిచ్చాడు.

దొడ్లల్ల బర్లు దొడ్లల్లనే ఉన్నాయి. రోజూ అడవిల తిరిగిన అలవాటు. కట్టుమీద గుంజుకుంటున్నాయి. అప్పుడప్పుడు మూతిని పైకెత్తి 'హ్రాయ్' అని అరుస్తున్నాయి. ఈగలు దోమలు కరుస్తుంటే కట్టేసిన గుంజచుట్టూ బంతి తిరుగుతున్నాయి. పొద్దంతా పొలంకు వెళ్లే రైతులు పగటీల్లి వచ్చి బర్లకు నీళ్లుపెట్టి గడ్డివేసి, సంటిదుడ్డెలను గట్టిగ కట్టేసి గంగయ్య ఇంటివైపోసారి తొంగిచూసి వెళ్తున్నారు. బర్లను జంగిట్లకొట్టి ఇంటిముందు పాకను శుభ్రంగా ఊడ్చుకునే ఇల్లాళ్లు 'అంగడంగడుందని' విసుక్కుంటున్నారు.

'అవ్వబిడ్డలు బర్ల లెక్కున్నరు. వాళ్లు కాసుకత్తె ఏమయితది. జరం ఎన్ని రోజులత్తె అన్ని రోజులు గిట్లనేనా? జీతమిచ్చేటప్పుడు ఏమన్న తక్కువ తీసుకుంటడా' అని విసుక్కున్న వారు కూడా లేకపోలేరు.

రెండు రోజులు గడిచాయి. గంగయ్యకు జరం తగ్గింది కాని కాలునొప్పి ఎక్కువైంది. కాలు రోకలిబండలెక్క వాచింది. ముల్లు పూర్తిగ బైటకు రాలేదని మరోసారి చీరాడు డాక్టర్. పుండు చీమునెత్తురుతో గూడు కట్టింది. 'మొదలు తీసిన నాడే మంచిగ తియ్యద్దా? ముల్లు లోపల ఉండుట వల్లనే ఇంతపనైందని' లింగవ్వ డాక్టర్‌ను అడిగింది.

'నువ్వు నాకు కట్టలకు కట్టలు రూపాయలు కట్టిత్తున్నవని మంచిగ తీత్తా తియ్యి. ఈడికి మందులు గోలీలు ఇచ్చుడే దండుగ' అన్నాడు డాక్టర్.

వారం రోజులవరకు ఎక్కువ నడువద్దని లేకుంటే మల్లానొప్పి పెడుతుందని చెప్పాడు డాక్టర్ గంగయ్య మనసు బాధతో మూల్గింది. 'ఇట్ల ఇంట్ల కుసుంటె ఎట్ల. ఇప్పటికే మూడు రోజులయింది. ఊర్లె ఏమంటున్నరో ఏమో! మరో వారమంటే జీతాలిచ్చేకాడ కిరికిరి పెడుతరు. వాళ్ల భయానికే వాననకా ఎండనకా బర్లెంటపోతిని' భార్యతో అన్నాడు.

"ఏంజేత్తాం! వాళ్లు జుాత్తలేరా! మనం కావాలని పోతలేమా!! కట్టం సుఖం ఎరుకున్న మారాజులు. అప్పుడప్పుడు వచ్చి చూసిపోనేవట్టిరి. కడుపు చేతుల పట్టుకున్నోల్లం. చూసి చూసి కడుపు మీద కొడతరా!" అన్నది లింగవ్వ. పైకి అలా అన్నది కానీ లోలోపల భయంగానే ఉందామెకు.

ఎవరో కూలీకి పిలిస్తే సలి బువ్వతిని వెళ్లింది లచ్చిమి. దొంతికుండలు సదిరి పురిశెడు నూకల్ని తీసి గంజి కాయడం మొదలెట్టింది లింగవ్వ. బజారు వెంట దుమ్మొస్తుంటే అంబటాల్లకు దుమ్మెక్కడిదని గెంటుతూ బయటకు వచ్చి చూసిండు గంగయ్య. అతడి గుండెలో వణుకు మొదలయింది. చలి జ్వరం మళ్లీ అందుకుంది.

బర్ల వెంట ఎవరో ఉన్నారు. నోటిముందు బుక్కను ఎవరో లాక్కున్నట్టుగా అనిపించింది గంగయ్యకు. అలికిడికి లింగవ్వకూడా బయటకు వచ్చింది. తమ రాజ్యాన్ని శత్రురాజులెవరో ఆక్రమిస్తుంటే విలవిల లాడిపోతున్న మహారాణిలా కుమిలిపోయింది. గంగయ్య నిర్వేదంగా చూస్తుండిపోయాడు. లింగవ్వకు ఏదో తెగింపు వచ్చింది. చావు తప్పదని తెలిసినంక పులితోనైనాసరే ఎదురొడ్డి పోరాడే తెగింపు అది.

బర్లకు అడ్డం తిరిగింది లింగవ్వ. వాటి ఎంబడి వత్తున్న పోశాలు రెండడుగులు వెనక్కివేశాడు. రెండు దోసిళ్ళ మన్నును ఎత్తి పోశాలు వైపు పోస్తూ 'నీకు మేమే దొరికినామురా! మా కడుపుమీద గొట్టి నీకడుపు నింపుకుంటావురా. మా ఉసురు నీకు తలుగుతదిరా! నాశినమైపోతవురా' అన్నది.

అప్పటికే దుఃఖం గొంతువరకు వచ్చి మాటల్ని మింగేసింది.

చేతిలో పని పోతుందన్న బాధ గంగయ్య గుండెను మెలితిప్పింది. కుంటుకుంటూ పోశాలు వద్దకు వచ్చాడు. "వారీ పోశమూ! కాళ్లు రెక్కలున్నోనివి. నాపనే దొరికినాదిరా! ఏండ్లనుండి బర్లతోనే బతుకుతున్న. ముల్లు ఇరిగిన కాలు నడువత్తలేదు. ఒంటికాలిమీద తండ్లాడుకుంటునడుద్దామన్నా అది కుంటికాలురా! ఇయ్యాల్లరేపట్ల నొప్పి తగ్గితే...."

అతడి మాటలు పూర్తి కాకముందే గుర్రుగా చూస్తు అన్నాడు పోశాలు. "నాకు గదంత తెల్వది. బాల్‌రెడ్డి పటేలు జెప్పిండు. బర్లనునన్నే కాయిమన్నడు. నీకు నడుసుడు చాతగాక బర్లను మడుగులల్ల' పండవెట్టి ఇంటికి కొట్టుకత్తున్నవట. అడివంత తింపుతేనే గదా! కడుపునిండ మేసి పాలిచ్చేది. మడుగులగొట్టి గడ్డమీద ఆరజూపుకుని పంటే తీసెయ్యక ఏంజేత్తరు. అయినా బర్లను నువ్వు గుత్తకుగొన్నవా? ఎవలచాతనైతే వాళ్లు గాత్తరు. అంటూ దుమ్ములో కలిసి బర్లెంబడి పోయిండు.

బర్లను తన పాణంలెక్క జూసుకున్నడు. కాళ్లు గుంజినా కడుపునొచ్చినా, ఎండనకా వాననకా అడివిల ఎక్కడ గడ్డి మంచిగుంటె అక్కడికి కొట్టుకపోయి మేపిండు. ఇప్పుడు పోశాలు ఈ మాట లంటుంటే శీలం మీద నిందపడిన ఆడిదాని లెక్క గిలగిలలాడి పోయిండు. లింగవ్వ ఊరును ఊరిలో మనుషులను తిట్టుకుంట ఇంట్లకు నడిస్తే దిగులుగా వెంట నడిచిండు. ఇద్దరు కూడబలుక్కుని బాల్‌రెడ్డి ఇంటికి వెళ్లారు.

వరండాలోనే కుక్క 'భౌ'మన్నది. ఎవరినో తిడుతూ బాల్‌రెడ్డి గొంతు పెద్దగా వినిపిస్తుంది. టి.వి.లో మాటలు వినిపిస్తున్నాయి. బిక్కుబిక్కు మంటూ వెళ్లి కడప వద్ద నిలబడ్డారు చెరోవైపు. గొంతు పెగల్చుకుని 'పటేలా' అన్నది లింగవ్వ.

పాలేరుకేదోపని చెప్పుతూ బయటకు వచ్చాడు బాల్‌రెడ్డి. ఇద్దరిని చూడగానే అతడి పెదాలపై నవ్వు మెరిసింది. వాలుకుర్చీలో కాలుమీద కాలేసుకుని కూర్చుంటూ అన్నాడు.

"బర్లగాసుడు నీకు వాకగాదురా. ఆ చెట్లల్ల యాడన్న ఇరుగవడితే ఊరోల్లబర్లను కాసుకుంట అడ్డంబడ్డగదా! నన్ను ఊరోల్లే సాదాలెనంటవు. ఇంకేదన్నా పనిజేసుకబతుకు, ఒక్క బర్రెనన్న రీతిగున్నాదిరా! తిరుగుడు చాతగాక వాగు పొంట పండవెట్టుకత్తున్నవు".

గంగయ్య కళ్లలో రక్తం చిమ్మింది. గొగ్గాళ్ల మీద మౌనంగా కూసున్నడు. లింగవ్వనే బతిలాడుతుంది. సందులేకుంట మాట్లాడుతుండు బాల్‌రెడ్డి. అతడు తమను పట్టుపట్టిండని తెలిసిపోతూనే ఉంది ఇద్దరికి.

"గరీబోని పొట్టమీద గొడితే ఏమత్తదిపటేలా! పిచ్చుకుంట్లోన్ని కొడితే చిప్పపలిగిపోయిందట. పండుగనక పబ్బమనక మీ బర్లెంబడి ఇన్నేండ్ల కొద్ది తిరిగిన. తుపానులచ్చి ఇగంపెట్టి ముసురు పడుతుంటే మీరు దుప్పటి గప్పుకుని ఇంట్లకూసుంటే నేను అడివిల నానిన. అయ్యో! ఇంత ముసుర్ల గంగడెటుపోయిండోనని ఒక్కరికన్న యాదికచ్చిన్నా పటేలా! పాలుకాగవెట్టి ఎచ్చగ చాయతాగంగ పాలిచ్చిన బర్రె.... బర్రెంబడి గంగడు ఎవలకన్న యాదికచ్చిండా పటేలా! నెత్తి పగిలే ఎండల ఫ్యాన్లు పెట్టుకుని ఇంట్ల గూసున్నరు. సల్లసల్లగుంటదని సల్ల చేసుకుని తాగింద్రు. ఆసల్లనిచ్చిన బర్రె బర్రె ఎంబడున్న గంగడు ఎండల యాడమాడిపోతుండోనని ఊరందరిల ఒక్కరన్న యాదిజేసింద్రా పటేలా!'... గంగయ్య ఉద్విగ్నంగా అంటుంటే అడ్డుతగిలింది లింగవ్వ.

"గాపిచ్చిపిచ్చి మాటలేంది. జానెడు కడుపు కోసం బర్లగాత్తున్నవు. నువ్వు వట్టిగనే కాత్తున్నవా? వాళ్లు ఆరునెలల కొకనాడు జీతమిత్తలేరా! చెడమిర్ర మాట్లాడితే ఎవలన్న దగ్గరికితీత్తరా...' భర్తపై కన్నెర్ర జేసింది.

"ఇచ్చిండ్రే..... జీతమిచ్చిండ్రు. వాళ్లిచ్చిన జీతంతో ఒక్కనాడన్న కడుపునిండతిన్ననా...? ఎడదుడ్డె సంటిదుడ్డె అని దుడ్డెలకు జీతమేలేదాయె. బర్రె బాగలేక ఆరునెలలు కాసినంక చచ్చిపోయినా సచ్చిన బర్రెకు జీతం తీసుకుంటావురా అనిరి. చేన్లల్లపడితే పయామాలనిరి దండుగనిరి. ఏం ముల్లె గట్టుకున్ననే" ఆవేదనగా అన్నాడు. లింగవ్వ గయ్యిమంది భర్తమీదికి. బాల్‌రెడ్డి చిరునవ్వు నవ్వాడు.

"బర్ల గాసుకుంట అడవులు తిరుగుతున్నవుగదరా! అన్నలతోని సోపతయినట్టుంది. గందుకనే ఇట్ల పిచ్చిపిచ్చి మాట్లాడుతున్నవు. ఏందేందో ఎండ, సలి, అంటున్నవు. కడుపు నిండనిది కట్టమెందుకు జేత్తున్నవురా! నిన్ను ఎవలన్న చెయ్యిమంటుండ్రా! బతిలాడుతుండ్రా! కడుపునిండినోడు ఎవడో జేస్తడు". అంటూ ఇంట్లోకి నడిచాడు.

తను ఎట్లనో బతిలాడి కాళ్లు పట్టుకుంటనంటే కాకుండ జేసిందని లింగవ్వ గంగయ్యను తిట్టింది. ఒకరినొకరు తిట్టుకుంటూ ఇంటికి జేరిండ్రు. ఇంట్ల అల్లుడు కనిపించిండు. మొహమంత మాడ్చుకున్నడు. ఎప్పుడచ్చినవని పలకరించినా మాట్లాడలేదు. బిడ్డ ఏదని అడిగితే ఏంజెప్పాలెనని మనసు తొక్కులాడింది లింగవ్వకు.

ఆ ఇల్లు ఈ ఇల్లు తిరిగి బియ్యం చేపోయి తెచ్చి అన్నంవండింది. పచ్చిపులుసు పిసికి పోసుపెట్టింది. సొలుక్కుంట సొలుక్కుంట కూతురు కైకిలిపోయినోల్ల చేనుకాడికి పోయింది. బిడ్డవంతుకు తను కలుపుతీత్తనని లచ్చిమిని ఇంటికి పంపింది.

పందిరి కింద మంచం వాల్చుకుని పడుకున్నాడు గంగయ్య. ఒక్కొక్క బాధ ఒక్కొక్క ముల్లయి గుండెను కెలుకుతుంది. ఎర్రటి ఎండలో పాణం బాగలేని భార్య ఎట్ల ఇల్లు చేరుతదో అనుకున్నాడు. అల్లుడు కూతురును తీసుకెళ్తాడో లేదో నన్న భయం కూడా మొదలయింది. చేతిలో పనిపోయింది. రేపు ఏంచేసుకబతకాలె అన్న భయం కూడా గుండెను పిండుతుంది. ముండ్లలాంటి ఈ బాధలముందు ముల్లు గుచ్చిన కాలిబాధ ఏపాటిదనిపిస్తుంది. ఏంపని చేసుక బతుకాలె అని ఆలోచిస్తున్నాడు.

బిడ్డను తరిమేసిన అల్లుడు, చేతులపనిని లేకుండా చేసిన బాల్‌రెడ్డి, పైసలియ్యరని సరిగా వైద్యం చేయని డాక్టర్, తనకడుపు నింపుకోడానికి మరొకరి కడుపుకొట్టిన పోశాలు.... చేతికందినంక పారిపోయినకొడుకు... వీరంతా శాగవారిన ఈతముండ్లకంటే భయంకరంగా కనిపిస్తున్నారు గంగయ్యకు ●